





గుంతల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

జర దేఖో

డేంజర్.. యమ డేంజర్..

- వంద మీటర్లు.. వంద గుంతలు
- మాధవనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద వాహనదారుల ఇక్కట్లు
- ఆలస్యమవుతున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు
- పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారులు

ఇందూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేట్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మిస్తున్న ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల కొరతతో పనులు సక్రమంగా సాగడం లేదు. రూ.93 కోట్ల వ్యయంతో ప్రారంభించిన ఈ బ్రిడ్జి పనులు రోజురోజుకూ ఆలస్యమవుతుండటంతో నిర్మాణ వ్యయం పెరుగుతుంది. ఇటీవల వంద కోట్ల వరకు నిర్మాణ వ్యయం పెరగగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు సాగుతుండటంతో రైల్వే గేటు వద్ద రోడ్డు కూడా గుంతలు పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ తాత్కాలిక రోడ్డు వేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో వంద మీటర్ల దూరం రోడ్డులో వందకు పైగా గుంతలు ఉండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వంద మీటర్ల దూరానికి 20 నిమిషాల పైనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్ద గుంతల్లో వాహనదారులు పడి గాయపడుతున్నారు. శనివారం ఆ గుంతలో లారీ దిగబడిపోగా సుమారు 2గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయేంతవరకు తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్, అధికారులపై ఉండగా ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- పూజారి ఇంట్లో దొంగతనం చేసిన వారిని పట్టుకున్న పోలీసులు
- నిందితులు పాత నేరస్థులు
- వివరాలు వెల్లడించిన సీపీ సాయిచైతన్య

నిజామాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల బ్రాహ్మణ కాలనీలో జరిగిన భారీ బంగారు చోరీ కేసును పోలీసులు ఐదు రోజుల్లోనే చేదించారు. జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలో పాత నేరస్తులే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పక్కా ప్రణాళికతో పక్కకాలనీలో ఉండే నేరస్థులే ఈ చోరీకి పాల్పడినట్లు సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీకి పాల్పడింది ఇద్దరు పాత నేరస్తులేనని సూత్రదారుడితో పాటు మరో

మిగతా 8వ పేజీలో...

గోదావరికి నీటి ప్రవాహం

- నీట మునిగిన పంటలు, నిలిచిన రాకపోకలు

నవీపేట/రెంజల్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): యంచ, కందకుర్తి గోదావరికి ఆదివారం భారీగా నీటి ప్రవాహం పెరిగింది. నవీపేట మండలంలోని కోస్లీ, మిట్టాపూర్, యంచ, బినోల, నాళేశ్వర్ తదితర గ్రామాలలో వరద ఉధృతికి పంటలు నీట మునిగాయి. యంచ నుంచి అల్లాపూర్ వెళ్లే దారి గోదావరి వరద ప్రవాహం నీట మునగడంతో రెండు గ్రామాల మధ్యన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మిట్టాపూర్ వెళ్లే దారిపై సైతం వరద రావడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. యంచ

మిగతా 8వ పేజీలో...



కందకుర్తి రామాలయం చుట్టూ చేరిన వరద



'ఆమె' ఎవరో..?

- జడ్పీ పీఠం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారే
- బీసీ మహిళ, బీసీ జనరల్, జనరల్, జనరల్ మహిళ స్థానాల కోసం వేట
- ఇప్పటి వరకు జడ్పీ చైర్‌పర్సన్‌లుగా ముగ్గురు మహిళలు

నిజామాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిన్న మొన్నటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధత నెలకొనగా ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను ప్రకటించిన నేపథ్యంలో ఇప్పుడు రాజకీయ పార్టీలలో సందడి నెలకొంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో అన్ని పార్టీలలో జడ్పీ పీఠం కోసం ఇప్పటి నుంచే కసరత్తులు మొదలయ్యాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లలో ఉన్న మహిళ నేతలు, ముఖ్య నేతలు జడ్పీ పీఠంపై కన్నేశారు. తమకు అనుకూలంగా ఉన్న మండలాలలో రిజర్వేషన్లకు అనుగుణంగా ఆశావహులు ఇప్పటి నుంచే మంతనాలు జరుపుతున్నారు. జిల్లాలోని 31 మండలాలల్లో జిల్లా పరిషత్ స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. 31 జడ్పీటీసీలలో 14 మండలాలను మహిళలకు కేటాయించారు. ఇందులో బీసీ మహిళ స్థానాలు 6 ఉండగా జనరల్ మహిళ స్థానాలు 5, జనరల్ స్థానాలు 5, బీసీ జనరల్ స్థానాలు 7 ఉన్నాయి. ఈ మండలాలలో ఎక్కడి నుంచైనా పోటీ చేసి గెలిచిన వారు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉండటంతో అక్కడ తమకు అనుకూలమైన వాతావరణం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని పార్టీలలో సీనియర్ నాయకులు తమ భార్యలు కానీ బంధువులను కానీ పోటీలో నిలిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు మండలాల పరిధిలో ఎంపీపీలకు కూడా ప్రాధాన్యం ఉండటంతో ఎంపీపీలుగా గెలిచేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. జడ్పీటీసీ టికెట్‌తో పాటు ఎంపీటీసీ టికెట్‌ను ఆశిస్తున్న వారు అన్ని పార్టీలలో ఇప్పటి నుంచే ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. కుదిరితే జడ్పీటీసీ టికెట్ లేదంటే ఎంపీటీసీ టికెట్‌తో ఎంపీపీ అయ్యే ఆలోచనలో అన్ని పార్టీల నేతలు కసరత్తులు ప్రారంభించారు. ఇప్పటి వరకు నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లుగా ముగ్గురు మహిళలు పనిచేయగా రాబోయే జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారో కాలమే నిర్ణయిస్తుంది.

జడ్పీ చైర్‌పర్సన్‌లుగా ముగ్గురు..

నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లుగా ఇప్పటి వరకు ముగ్గురు మహిళలు పనిచేశారు. 1960 నుంచి నిజామాబాద్ జిల్లా పరిషత్‌కు చైర్మన్‌లుగా పనిచేస్తుండగా 1987 జూలై 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు చైర్‌పర్సన్‌గా సిలవేరు లలిత మల్లేష్ మొదటి సారిగా పనిచేశారు. ఆ తర్వాత 1987 డిసెంబర్ 7 నుంచి ఐదు సంవత్సరాల పాటు సిలవేరు లలిత మల్లేష్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆమె చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆతర్వాత జుక్కల్‌కు చెందిన శారద సూర్యకాంత్ టీడీపీ ప్రభుత్వ హయాంలో 1995 మార్చి 27వ తేదీ నుంచి 2000 మార్చి 18 వరకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2006 జూన్ 23 నుంచి 2008 ఆగస్టు 16 వరకు గాదారి అనిత రాజేశ్వర్‌రెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా పొత్తులో భాగంగా జిల్లా పరిషత్‌ను బీఆర్ఎస్‌కు కేటాయించడంతో ఆమె చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆమె అవిశ్వాస తీర్మానం ద్వారా దించేసి కాంగ్రెస్‌కు చెందిన వెంకటరమణారెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

మండలాలపై నేతల కన్ను..

జిల్లాలో 31 మండలాలకు జిల్లా పరిషత్ రిజర్వేషన్లను ప్రకటించడం తో పాటు జిల్లా పరిషత్

మిగతా 8వ పేజీలో...



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సేవాలాల్ మందిరంలో ఎమ్మెల్యే పూజలు

- జగదంబ మాతకు ముక్కుపుడక సమర్పించినఎమ్మెల్యే భూపతి రెడ్డి దంపతులు

ఇందల్వాయి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి దంపతులు ఆదివారం రోజు డిచ్‌పల్లి మండలం సాంపల్లి తండాలోని జగదంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో సాంపల్లి తండావాసులు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తే జగదంబ మాతకు ముక్కుపుడక, ఒడి బియ్యం సమర్పిస్తామని మొక్కుకోగా ఆ మొక్కును ఎమ్మెల్యే దంపతులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వినోదిని రెడ్డి, మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కంచెటి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి చిహ్నం బతుకమ్మ

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ
- పోలీసు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు
- ఆడిపాడిన మహిళలు

8



ఎస్సారెస్పీకి భారీగా వరద ఉధృతి..

మెండోర, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 39 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 4 లక్షల 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ చక్రపాణి తెలిపారు. మహారాష్ట్రలో భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఉదయం 2 లక్షల 50వేల క్యూసెక్కుల వరద రావడంతో 3 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. మధ్యాహ్నం స్వల్పంగా 50 వేల క్యూసెక్కుల వరద పెరగటంతో ఉదయం కంటే లక్షా 50 వేల క్యూసెక్కుల నీరు ఎక్కువగా విడుదల చేయడంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఉన్న రైతుల పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరద కాలువకు 500 క్యూసెక్కుల, కాకతీయ కాలువకు 4000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కులు, నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1084 అడుగుల 58 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

మంజీర ఉగ్రరూపం

గ్రామంలోకి చేరిన వరద



- తీర గ్రామాలు అతలాకుతలం
- జలదిగ్బంధంలో మంజీర పరీవాహక గ్రామాలు
- సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు
- నీట మునిగిన 7వేల ఎకరాలు

బోధన్,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మంజీర ఉగ్రరూపం దాల్చింది. మంజీర తీర గ్రామాలు అతలకూతలం అవుతున్నాయి. జలదిగ్బంధంలో మంజీర పరివాహక గ్రామాలు కలెక్టర్ ఆదేశాలతో గ్రామస్థులను రెవెన్యూ అధికారులు బస్సులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. 40ఏళ్ల తర్వాత ఇంతటి వరద ఉధృతి రావడం ఇదే ప్రథమం. వాగులు, వంకలు పొంగడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద వస్తుండడంతో మహారాష్ట్ర నుంచి భారీ వరద రావడంతో మంజీర ఉప్పొంగి ప్రవహిస్తోంది. శనివారం రాత్రికే ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ గ్రామాల్లోకి వచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే అధికారులు గ్రామానికి వచ్చి గ్రామస్థులను బస్సుల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హంగర్గ గ్రామంతో పాటు బికినెల్లి, ఖండ్‌గావ్, కొప్పర్గ గ్రామాలతో పాటు సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్, హున్స గ్రామాలను మంజీర చుట్టు ముట్టింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హంగర్గ తదితర ముంపు గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉండేలా చూడాలని ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



ఖండ్‌గావ్, కొండల్ వాడి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న మంజీర

8 అడుగుల వరకు వరద..

మంజీర ఉగ్రరూపం దాల్చడంతో అధికారులు అప్రమత్తమై హంగర్గ గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ మంజీర పరివాహక ప్రాంతాల గ్రామాల్లోకి ప్రవేశిస్తుంది. ఆదివారం తెల్లవారు జామున హంగర్గ గ్రామంలోకి 8 అడుగుల వరకు వరద నీరు రావడంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసి వారిని పునరావాస

మిగతా 8వ పేజీలో...

ఖండ్‌గావ్, కొండల్‌వాడి రాకపోకల నిలిపివేత

తెలంగాణ సరిహద్దు గ్రామామైన ఖండ్‌గావ్ నుంచి మహరాష్ట్రలోని కొండల్ వాడికి రాకపోకలు నిలిచిపోయాయి. మంజీర ఉధృతంగా ప్రవహిస్తుండడడంతో ఖండ్‌గావ్, కొండల్‌వాడి మధ్యన ఉన్న బ్రిడ్జిపై నుండి మంజీర ప్రవహిస్తుండడంతో రెవెన్యూ అధికారులు రాకపోకలను నిలిపివేశారు.

దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త



మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్‌కీబాత్‌లో చెప్పిన విధంగా దేశీయ ఉత్పత్తులను ప్రోత్స హించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని నరేంద్రమోదీ 126వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని సుభాష్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశప్రజలందరూ స్వదేశీ వస్తువులను ఉపయోగిస్తూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని మన్‌కీబాత్ వేదికగా ప్రధాన మంత్రి దేశప్రజలకు పిలుపుఇవ్వడం జరిగిందన్నారు. భారతీయ మహిళలు తమ నారీశక్తితో వివిధ రంగాల్లో చూపిస్తున్న ప్రతిభను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునేలా ఎదగడం గర్వకారణం అన్నారు. నావీ, ఎయిర్‌ఫోర్స్, రక్షణ రంగాలతో పాటు గ్రామీణస్థాయి మహిళలు సైతం చిన్న చిన్న కుటీర పరిశ్రమలతో అభివృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్ఎస్ఎస్ చేసిన సేవలను ప్రధాని గుర్తు చేయడం జరిగిందన్నారు. దేవి నవరాత్రులు, దీపావళి కానుకగా మోదీ దేశ ప్రజలకు గొప్ప బహుమతిగా జీఎస్టీ తగ్గింపులు చేశారని అన్నారు. ప్రముఖ లలిత కళారంగాలలో పేరుపొందిన వారికి ప్రోత్సాహకంగా పద్మశ్రీతో గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రముఖ గాయనీ లతామంగేష్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, జిల్లా సెక్రెటరీ జ్యోతి, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించుకుంటాం

ప్రతీ సంవత్సరం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటాం. అందులో సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రత్యేకతగా భావిస్తాం. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మ ఆడటం చాలా ఇష్టంగా జరుపుకునే పండుగ. నాటి కాలం నుంచి ఇప్పటి వరకు తరాలు మారిన బతుకమ్మ వేడుకలు మాత్రం ఆనవాయితీగా నిర్వహించుకునే పండుగ.

- సుగుణమ్మ, బ్యాంక్ కాలనీ, వినాయక్‌నగర్



నాలుగు గంటల నుంచే బతుకమ్మ ఆడేవాళ్లం

సాయంత్రం నాలుగు అయ్యిందంటే బతుకమ్మఆడటం ప్రారంభించేవాళ్లం. ప్రతీరోజు మూడు గంటల పాటు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడేవాళ్లం. ఉదయంపూట పూల సేకరణ సాయంత్రం బతుకమ్మ ఆడుతూ తొమ్మిది రోజుల పాటు సంబురంగా బతుకమ్మ వేడుకలను జరుపుకునేవాళ్లం. తరాలు మారిన బతుకమ్మ వేడుకలకు ప్రాధాన్యత తగ్గదు.

-రాజేశ్వరి, ఎల్లమ్మగుట్ట



ప్రతీరోజు పండుగను ఆనందంగా జరుపుకునేవాళ్లం

ప్రతీరోజు బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకునేవాళ్లం. తొమ్మిదిరోజుల పాటు వేడుకలను ఒక్కోక్కరోజు ఒక్కోక్క రకంగా జరుపుకునేవాళ్లం. పండుగ వచ్చిందంటే స్నేహితులతో, బంధువులతో జరుపుకోవడం ఆనందంగా ఉండేది.ఈమధ్యకాలంలో పండుగ కొత్త వేదికను సంతరించుకుంది. సద్దుల బతుకమ్మ రోజున మధ్యాహ్నం ప్రారంభ మయ్యే వేడుక రాత్రి వరకు కొనసాగేది.

- ఇందిరరాణి, సీతారాంనగర్ కాలనీ



క్రైం సమాచారం

తాళం వేసిన ఇళ్లే దొంగల టార్గెట్



దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సదాశివనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇండ్లనే దొంగలు టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఎస్సై పుష్పరాజ్ అన్నారు. శనివారం అర్ధరాత్రి భూంపల్లిలో గుర్తుతెలియని దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లలో నగదు, బంగారం, వెండి వస్తువులు దొంగిలించడం జరిగిందని అన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్లూస్ టీంను పిలిపించి సీఐ సంతోష్‌కుమార్‌కు సమాచారం అందజేయగా సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.చుట్టుపక్కల సీసీ కెమెరాలను తనిఖీ చేస్తూ దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. తాళాలు వేసి ఇళ్లను ఖాళీగా వదిలి పెట్టవద్దని, విలువైనా వస్తువులను పొరుగు వారి అప్పగించడం గానీ ఇంట్లో ఒకరు ఉండేలా చూసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేల్పూర్,సెప్టెంబరు,28(ఆంధ్రజ్యోతి):మండలంలోనివేల్పూర్‌క్రాస్ రోడ్డు వద్ద 63వ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి 12.30 సమ యంలో మోర్తాడ్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనంను గుర్తుతెలియని వా హనం ఢీకొంది.ఈ ఘటనలో మోర్తాడ్‌కు చెందిన అల్లకుంట దినేష్ (26) అక్కడిక్కడే మృతిచెందగా అతడి స్నేహితులు కార్తీక్, రాజ్‌కు మార్‌లకు తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స కోసం నిజామాబాద్ ఆసు పత్రికి తర లించినట్లు ఎస్సైసంజీవ్ తెలిపారు.క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి కూతుళ్ల అదృశ్యం

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన తల్లి కూతుళ్ల అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం భర్త రాములుతో గొడవ పడిన స్వప్న తన సంవత్సరం కూతురితో పాటు ఎవరికి చెప్పకుండ ఇం టి నుంచి వెళ్లిపోయింది.స్వప్నఆచూకీ కోసం గ్రామాలలో బంధువుల ఇళ్లలో గాలించినప్పటికి కనిపించకపోవడంతో పోలీస్‌లకు భర్త రాములు ఫిర్యాదు చేశారు.కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దేశీదారు మద్యం పట్టివేత

బిచ్కుంద,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):దేశీదారును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మహారాష్ట్రలోని డెగ్లూర్ నుంచి పిట్లం మండలంలో బండపల్లి గ్రామానికి మద్యం దేశిదారును ద్విచక్రవాహనంపై 8 దేశిదారు మద్యం బాటిల్‌లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామ గేటు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామానికి చెందిన గుల్ల చిన్నఅంజయ్య(42) తన ద్విచక్రవాహనంపై బొగ్గుగుడిసె చౌరస్తా నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో అన్నాసాగర్ గేటు సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అంజయ్య అక్కడిక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నర్వ గ్రామంలో విషాదఛాయలు

మహమ్మద్‌నగర్: మండలంలోని నర్వగ్రామానికి చెందిన అంజయ్య అన్నాసాగర్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచె ందడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించా రు. కుటుంబ సభ్యులు,గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బాన్సువాడటౌన్,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో ఓమహిళపై బెదిరించి డబ్బు,బంగారం, ఫోన్‌దోచుకున్న నిందితుడిని, దొంగసొత్తును కొన్న వ్యక్తిని పట్టుకుని పోలీసులు కేసును ఛేదించారు. ఆదివారం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి కేసు వివరాలు తెలిపారు. ఈ నెల 19ననిజాంసాగర్ మండలానికి చెందిన మేడిపల్లి లక్ష్మీని, నీరడి సాయిలు బాన్సువాడ పోచమ్మగల్లీ వద్దకు పిలిపించి ఆమె వద్ద ఉన్న 50వేల నగదు,బంగారు హారం, సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాన్సువాడ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాన్సువాడ సీఐ అశోక్ సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా తాడ్కోల్ చౌరస్తా వద్ద నిందితుడు నీరడిసాయిలును, దొంగసొత్తు కొన్న వ్యక్తి బుర్రవెంకటరమణను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా 11గ్రాముల బంగారు గుండ్లహారం,ఒకసెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.తక్కువ సమయంలో నిందితులను పట్టుకుని దొగిలించిన సొత్తును రికవరీ చేసినందుకుగాను జిల్లా ఎస్పీరాజేశ్‌చంద్ర,డీఎస్పీవిఠల్‌రెడ్డిని,సీఐ,సిబ్బందిని అభినందించారు.

మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించిన నాయకులు



మన్‌కీబాత్‌లో కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మోర్తాడ్, సెప్టెంబరు, 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్‌జీజీ ఫంక్షన్ హాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ 126వ మన్‌కిబాత్ కార్యక్రమాన్ని వివిధ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి మల్లికార్జున్‌రెడ్డి, జాతీయ పసుపుబోర్డు అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి హాజరయ్యారు. ప్రత్యక్ష ప్రసారాన్ని బాల్కొండ నియోజకవర్గలలోని 9 మండలాల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు వందల సంఖ్యలో పాల్గొని ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు పుప్పాల నరేష్, శివనందిరెడ్డి, తీగెల రమేష్, వివిధ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నందిపేట మంతెన గల్లీలో కరెన్సీతో దేవికి అలంకరణ



బోధన్‌లో మహాచండీ యజ్ఞ మహోత్సవం



ఆర్మూర్ద్ మహాచండియాగంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



కోనాపూర్‌లో..

జిల్లా వ్యాప్తంగా దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.మండల గ్రామాల్లో పలుచోట్ల యజ్ఞాలు, హోమాలు, కుంకుమార్చనలు, అన్నదానాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు, దంపతులు, నాయకులు దేవీ మాలదారులు,యువకులు,యువతులుపాల్గొన్నారు.నందిపేటలోలక్ష్మీదేవి రూపంలో అమ్మవార్లు దర్శనమిచ్చారు.మంతెన గల్లీలో రూ.కోటి 52 లక్షల 52వేల 611 లతో అలాగే పాతూర్‌లో సుమారు రూ.1.11కోట్ల కరెన్సీ నోట్లతో దుర్గాదేవిని అలంకరించారు.పెగడాపల్లి గ్రామంలో మహాచండీ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మూర్‌లో వందేమాతరం యూత్, సింహవాహిని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత ఆలయం వద్ద ఆదివారం మహాచండీ యాగం, హోమం నిర్వహించారు.నవీపేటలో దుర్గామాతకు పల్లకిసేవ నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని రాజరాం నగర్ కాలనీలో శ్రీసూర్య కళ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి వద్ద హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఎడపల్లి,భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.వేల్పూర్, అర్గుల్‌లో ఆరే క్షత్రియ మహిళ సంఘం ఆధ్వ ర్యంలో దుర్గాదేవికి బోనాలతో నైవేద్యాన్ని సమర్పిం చుకున్నారు.ముప్కాల్ యజ్ఞం, హోమం నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. **- ఆంధ్రజ్యోతినెట్‌వర్క్**



నవీపేటలో ..



దుర్గాదేవిని దర్శించుకున్న పలుగుట్ట మంగిరాములు మహారాజ్



అర్గుల్‌లో..



ఎడపల్లిలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

యువత క్రీడల్లో జాతీయస్థాయికి ఎదగాలి



ట్రోఫీని అందజేస్తున్న ముత్యాల సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు 28:(ఆంధ్రజ్యోతి)రాష్ట్రప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నదని యువతమ విలువైన సమయాన్ని కేటాయిస్తూ క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకుంటూ.. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌అన్నారు.కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో మండలు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మూడు జిల్లాలు (నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల) వాలీబాల్ ఇన్విటేషన్‌టోర్నమెంట్ ముగింపు సమావేశంలోపాల్గొన్న ఆయన విజేత జట్లకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ నిర్వహకులు యూత్ కాంగ్రెస్ నాయకులను అభినందించారు.ఈటోర్న మెంట్‌లోను శుక్రవారం ఉదయం స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈటోర్నమెంట్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ ప్రారంభించారు. కాగా రెడు రోజు లపాటు (శనివారం అర్ధరాత్రివరకు) మూడు జిల్లాల క్రీడాకారులమధ్య హోరాహోరీగా కొనసాగిన టోర్నమెంట్ ఫైనల్ కోరుట్ల, కమ్మర్‌పల్లి జట్లుమధ్య రసవత్తరంగా సాగింది. ఇందులో ప్రథమస్థానం కమ్మర్‌పల్లి వాలీబాల్ జట్టు నిలువగా 8 వేల నగదుబహుమతితో పాటు ట్రోఫీని, రెండోస్థానంలో నిలిచిన కోరుట్ల జట్టుకు ఐదువేల నగదుతో పాటు షీల్డ్‌ను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అందజేశారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ మండల కాగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, డీసీసీ డెలిగెట్ తక్కూరి దేవేందర్, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, న్యాయవాది సరసం చిన్నారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దం రాజేశ్వర్ రెడ్డి, బోనగిరి లక్ష్మణ్, ఆవారి సత్యం,శేఖర్ నరేందర్, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో భగత్‌సింగ్ జయంతి

వేల్పూర్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో బీజేపీ, యువకుల ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో భగత్ సింగ్ కీలక పాత్ర పోషించి స్వాతంత్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వీరుడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల నాగేష్, స్థానికి వివిధ యువజన సంఘాల యువకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బట్టాపూర్‌లో పరామర్శిసున్న సునీల్

ఏర్గట్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. మండల కేంద్రంలో భూమన్న ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో గాయాలైన గడ్డం శశికాంత్, గుమ్మిర్యాల్‌లో రాకేష్‌లను, బట్టాపూర్‌లో షేక్ అంకుష్ కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, గడ్డం జీవన్, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండల గౌడ సంఘం నూతన కార్యవర్గం

ముప్కాల్ , సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని గౌడసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా బత్తిని రాజేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా సదానంద్‌గౌడ్, కార్యదర్శిగా సంతోష్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడ సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాగౌడ్, రాగిరిగౌడ్, నారాగౌడ్, రంజిత్‌గౌడ్, అంజగౌడ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

అడుగుదూరంలోనే కాడిచెరువు అలుగు



కాడి చెరువు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 28: (ఆంధ్రజ్యోతి) మండలంలోని అతిపెద్ద చెరువుగా పిలువబడే కాడిచెరువు ఇటీవలకురుస్తున్న ముసురువర్షాలు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం నీరుతో పాటు కోనాసమందర్ చెరువు నుంచి వస్తున్న అలుగు నీటితో ప్రస్తుతం కలకలలాడుతుంది. కాని అలుగు ఇంకా పరాడంలేదు. అలుగు పారడానికి కనీ సం అడుగుదూరంలో ఉంది. ప్రస్తు తాకి ఎత్తిపోతలను అధికారులు నిలిపివేశారు. ఈ చెరువు ఆయకట్టు మొత్తం కలిపి సుమారు రెండువేల ఎకరాల పైబడి ఉంటుంది. కాగా ఆకట్టు భూముల్లో బోర్లు వేసుకున్న రైతులు సుఎరు ఆరువందల ఎకరాల్లో వరి పంటలు వేసుకున్నారు. చెరవు నీటికై ఎదురుచూసిన సుమారు 17 వందల ఎకరాల భూముల్లో వరినార్లు వేసుకున్నప్పటికి చెరువు నిండకపోవడంతో అదను దాటిపోగా పోసినవర్నినార్లు పోలాల్లోనే వదిలివేయవలసివచ్చింది. కాడిచెరవు నిండితేకాలం అయినట్లే నని,అంతట పుష్కలంగా పంటలు పండుతాయని పెద్దలుచెప్పేమాట కాని ఈ ఏడాది వర్షలు సమయానికి కురవక చెరవు నిండకపోవండతో పెద్ద మొత్తంలో పంటలు పండించలేక సపోయారు.ప్రస్తుతం కాడిచెరువులో పుష్కలంగా నీరుచేరి అలుగుపాడానికి కేవలం అడుగుదూరంలో ఉన్న సంతోషం రైతుల్లో గ్రామస్తుల్లో కలుగుతున్నప్పటికి భారీస్థాయిలో నష్టపోయామని చెరువునిండితే ఇప్పుడేంలాభం అంటు ఆయకట్టు రైతులు పెదవి విరుస్తున్నారు.

సామాజిక మార్పు కోసం పోరాడుదాం

ఆర్మూర్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): కుల నిర్మూలన చైతన్యంతో సామాజిక మార్పు కోసం పోరాడాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహయ కార్యదర్శి దాసు అన్నారు. ఆదివారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో కుల నిర్మూలన చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గ పోరాట చైతన్యంతో దేశంలో కులనిర్మూలన సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూస్తు వివక్షకు గురిచేస్తున్నారని, కుల, గ్రామ బహిష్కరణతో అవమానాలకు గురిచేస్తున్నారన్నారు. కులవివక్షత చట్టప్రకారం నేరం అంటునే పాలకవర్గ పార్టీలు కులతత్వాన్ని పెంచుతున్నాయని ఆయన విమర్శించారు. కులరహిత సమాజం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయరెడ్డి, ఐఎఫ్‌టీయు జిల్లా సహాయ కార్యదర్శి జేపి గంగాధర్, సాయిలు, లక్ష్మణ్, భానుచందర్, పోశెట్టి, మోహన్, వర్దారెడ్డి, అనంత్, లోకేష్, ముగ్దం పటేల్, చిన్న గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆచన్‌పల్లిలో పరిచయ వేదికలో పాల్గొన్న నాయకులు

బోధన్,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రాజ బహదూర్ వెంకట్ రాంరెడ్డి స్ఫూర్తితో రెడ్డిలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని రెడ్డి సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షులు కలకోట సాంబిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోతడి గోపాల్ రెడ్డిలు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఫంక్షన్‌లో రెడ్డి కుటుంబాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరిచయల ద్వారా ఆత్మీయతను పెంపొందిస్తూ మరిన్ని ఆత్మీయ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రెడ్డి సంఘం యొక్క విలువలు కాపాడడానికి సమర్థ మార్గాలను తెలుసుకోవడానికి బోధన్ డివిజన్ స్థాయి రెడ్డి బంధువుల పరిచయ వేదిక త్వరలోనే ఇలాంటి సమ్మేళనాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సంకల్పించారు. రెడ్డి సంఘం సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గానికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఆచన్‌పల్లి అధ్యక్షులు మానుకొండ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, ఆచన్‌పల్లి ప్రధాన కార్యదర్శి గాంధారి రమేష్ రెడ్డి, రెడ్డి సంఘం ముఖ్య సలహాదారులు తూము శరత్ రెడ్డి, నర్సింహ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో రెడ్డి కుటుంబాల సభ్యులు, మహిళలు, ప్రముఖులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఇందూర్ విభాగ సహసంగ్ చాలక్ పాలేటి వెంకట్‌రావు అన్నారు. పట్టణంలోని మున్నూర్ కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ 1925 ప్రారంభమై దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలో అనేక దేశాలలో పనిచేస్తుందన్నారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచపరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారి బోచ్‌కార్ట్ దత్తాద్రి, దయాసాగర్, రాజేష్, కలిగోట గంగాధర్, కిషన్, రమేష్, నీరజ్, పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇస్తున్న డాక్టర్ లక్కం ప్రభాకర్

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా వెటర్నరి ఆసుపత్రిలో మండల ఎనిమల్ హస్బండరి ఆఫీసర్ డాక్టర్ లక్కం ప్రభాకర్ ఆదివారం రేబిస్ వ్యాధిపై పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలోఆర్మూర్‌మండలవెటర్నరీసిబ్బంది, ఉన్నారు.



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మాక్లూర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఆదివారం పశువైద్యాధికారి డాక్టర్ ఉమమతాహేర్ ఆధ్వర్యంలో యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబాయ్‌లో బతుకమ్మ సంబురాల్లో జయరెడ్డి నృత్యం



చిన్నారికి మెమోంటో అందజేస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

ఆర్మూర్, సెప్టెంబరు, 28 (ఆంధ్రజ్యోతి):దుబాయ్‌లో ఇండి యాన్ పీపుల్స్ ఫోరం ఆర్గనై జేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మసంబురాలలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మనుమ రాలు జయరెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనతో అందరిని అలరించారు. బతుకమ్మ సంబురాలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాల్లో జయారెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శనతో వీక్షకులను ఆకట్టుకున్నారు. చక్కటి ప్రదర్శన కనబరిచిన చిన్నారిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు అభినందించిన మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావు, డీ.కే అరుణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సుచరిత రెడ్డి, పాల్గొన్నారు.

యాదిలో..



ఇప్పటికీ బతుకమ్మ పాటలు పాడుతాను..

ఒకనాటి దినము ఉయ్యాలో.. తల్లి పార్వతిదేవి ఉయ్యాలో ఎమి చేసింది ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడేవాళ్లం. ఉదయం పూటనే తంగేడు, గునుగు, బంతిపూలను పోలం వద్ద నుంచి తీసుకునే వచ్చేటోళ్లము. సాయంత్రం బతుకమ్మలను పేర్చి హన్‌మాన్ గుడి వద్దకు తీసుకెళ్లి బతుకమ్మ ఆడి తర్వాత సర్గమ్మ వద్ద పెట్టి మహిళలందరము కలసి బతుకమ్మ పాటలు పాడి ఆడుతుంటిమి. చెరువులో నిమజ్జనం చేస్తుంటిమి.

● ముదాం పెద్ద లక్ష్మి, సీతారాంపూర్, దోమకొండ



బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకునేవాళ్లం

బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకునేవాళ్లం. తామే బతుకమ్మ పాటలు పాటుకుంటూ బతుకమ్మ ఆడుతుంటే ఎంతో సంతోషంగా ఉండేది. 65 ఏళ్ల క్రితం చేలలోకి వెళ్లి పువ్వును తేచ్చి అందంగా బతుకమ్మను పేర్చి ఆడుకునేవాళ్ళం. డిజే సప్పుడు లేదు. బ్యాండ్ సప్పుడు లేదు. పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడుతుంటే మనసు చాలా ప్రశాంతంగా ఉండేది. ఇప్పుడు డిజేలు పెట్టి ఎవరికి నచ్చినట్లు వాళ్లు డ్యాన్సులు చేస్తున్నారు.

● కర్రోల్ల పెంటవ్వ, గొట్టిముక్కుల, దోమకొండ



రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చేవాళ్లం

50 సంవత్సరాల కింద బతుకమ్మలను పేర్చేందుకు రకరకాల పువ్వులను పెట్టి పేర్చుతుంటిమి. పేపర్ పువ్వులను పెట్టివాళ్లం కాదు. అ దినంలో పూలు వ్యవసాయపోలాల వద్ద దొరికేవి. చిన్నప్పుడు తోటి వాళ్లతో కలసి బతుకమ్మ పువ్వును కోసుకుని వచ్చి అందంగా పెర్చి బతుకమ్మ పాటలు పాడి నిమజ్జనం చేసివస్తోంటిమి. నిమజ్జనం వద్ద సద్దిఅన్నం అందరితో కలసి భూజించేవాళ్లం. ఎంతో సంతోషంగా ఉండేది.

● ముదాం పెద్ద లక్ష్మి, సీతారాంపూర్, దోమకొండ



ప్రకృతి పండుగకు పూలు కరువు

- కనిపించని తంగేడు, గునుగు పూల చెట్లు
- రసాయనిక మందులు, యంత్రాల వాడకమే కారణం
- మాయమైపోతున్న కంచెలు, బీడు భూములు
- బతుకమ్మ పువ్వు కోసం అతివల తిప్పలు
- రోడ్లపై కొనుగోలు చేస్తున్న వైనం
- రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పూజించే సంస్కృతి దేశవ్యాప్తంగా కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంటుంది. దానికి నిదర్శనమే బతుకమ్మ పండుగ, ప్రకృతి ప్రసాదించిన పూలను ఎంతో అలంకారప్రాయంగా పేర్చి, కూర్చి, అందులో పసుపు ముద్దను పెట్టి గౌరమ్మగా భావిస్తారు. వాటికి పూజలు చేయడంతో పాటు మహిళలంతా ఒక్కచోట చేరి. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ఇలాంటి సంస్కృతి దేశంలో మరెక్కడ కనిపించదు. అందుకే బతుకమ్మ పండగ తెలంగాణ రాష్ట్ర పండగగా కీర్తించబడుతోంది. కానీ అదే ప్రకృతి పండగకు పూలు కరువు అవడం ఓకింత బాధపడాల్సిందే.



ఎల్లారెడ్డిలో రోడ్డుపై అమ్ముతున్న బతుకమ్మ పూలు

● కనిపించని తంగేడు, గునుగు పువ్వు

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ ప్రధానంగా తంగేడు, గునుగు పూలు లేనిది మహిళలు బతుకమ్మను పేర్చారు. ఎంత దూరమైనా ఎంత ఖర్చైనా సరే తంగేడు, గునుగు పూలు పెట్టి బతుకమ్మను చేయాల్సిందే. ఆ పూలు ఉంటేనే బతుకమ్మకు అలంకారమనేది మహిళల ప్రగాఢ నమ్మకం. అలాంటి పూలు ఇప్పుడు గ్రామాల్లో కనిపించడం లేదు. గతంలో ఎక్కడపడితే అక్కడ తంగేడు పూలు కనిపించేవి. పంట చేలల్లో పొలం గట్ల మీద గునుగు పూల చెట్లు గణనీయంగా మెరిసేవి. కానీ ప్రస్తుతం పూలను చూద్దామంటే కూడా కనిపించకపోవడంతో ఇక బతుకమ్మ పండగకు పూల కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

● రసాయనిక మందులు, యంత్రాల వాడకమే

గతంలో వ్యవసాయాన్ని ఎక్కువగా సేంద్రియ పద్ధతిలోని చేసేవారు. దీనికి తోడు భూమిని దున్నాలంటే నా గళ్ళతో పశువుల సహాయంతో దున్నేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి గ్రామాల్లో ఎక్కడ కనిపించడం లేదు. సేంద్రీయ వ్యవసాయం పక్కన పెట్టి ఇష్టానుసారంగా రసాయన మందుల వాడడంతో ప్రకృతి సిద్ధంగా పెరిగే తంగేడు గునుగు పూల మొక్కలు కనిపించటం లేదు. దీనికి తోడు ఎక్కువగా గడ్డి మందులను వాడడం సైతం ఈ మొక్కలను పెరుగుదలకు ఆటంకం కలిగిస్తోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పొలంలో పొలం గట్ల వెంట చేనుల్లో పెరిగే కొన్ని మొక్కలు సైతం యంత్రాల సహాయంతో దున్నడంతో భూమిలో కలిసిపోతున్నాయి. తద్వారా తంగేడు గునుగు పూల చెట్లు కనుమరుగు అవుతున్నాయి.

● రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు

తంగేడు, గునుగు పూలు కనిపించకపోవడంతో కొంతమంది వీధిని రోడ్లపైకి తీసుకువచ్చి ప్రజలకు అమ్మకాలు జరుపుతున్నారు. కట్టలుగా కట్టి తంగేడు గునుగుతో పాటు బంతి చామంతి మందార లాంటి ఇతర పూలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● మాయమైపోతున్న కంచెలు

ఒకప్పుడు ప్రతి గ్రామంలో సైతం ఊరి చివరన కంచెలు ఉండేవి. వాటికి తోడు బీడు భూములు సైతం కనిపించేవి. వాటిలో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా పెరిగేవి. దాదాపు ఊరంతటికి సరిపోయేంత పూలు లభించేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జనాభా పెరుగుతుండడంతో కొద్ది భూములు సైతం సాగులోకి వచ్చేస్తున్నాయి. కంచెలు బీడు భూములు ఏమున్నా మనిషి ఆధునిక పరికరాలతో సాగులోకి తెచ్చేస్తున్నారు. తద్వారా పూల మొక్కలు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం రోడ్లు, చెరువులు కుంటల వెంట కొన్ని తంగేడు చెట్లు పెరగడంతో కొంత మందికి మాత్రమే పూలు లభిస్తున్నాయి. వాటిని కూడా కొందరు తెంపుకొని నగరాలకు తరలించి అమ్మేసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు కూడా రోడ్లపైకి వచ్చి కొనుగోలు చేయాల్సి వస్తోంది.



కోకిల నాగరాజును సన్మానిస్తున్న యూఏఈ భారత రాయబారి

అబుదాబిలో కవి, గాయకుడికి సన్మానం

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంప్రదాయ పండుగ సంబురాలు కార్యక్రమంలో అబుదాబిలోని కవి, గాయకుడు నృత్య దర్శకుడు కోకిల నాగరాజును ఘనంగా సన్మానించారు. అబుదాబిలో తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలలో మహిళలు పిల్లలతో రూపొందించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకోవడంతో యూఏఈ భారత రాయబారి కార్యాలయ ముఖ్య అధికారి జార్జి జార్జ్ తెలంగాణ ఫ్రెండ్స్ అసోయేషన్ అధ్యక్షుడు రాజశ్రీనివాస్‌రావులు కోకిల నాగరాజును పట్టు శాలువ, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

ఆర్మూర్‌లో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆర్మూర్, సెప్టెంబరు, 28(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. అదే విదంగా కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్తను తీసివేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, మధుసుదన్, గణేష్, రాజ్‌కుమార్, నరేందర్, ఎల్లయ్య, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గల పేద ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తున్నది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ కు సంబందించిన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడిన వారు ఆసుపత్రులకు వేలాది రూపాయలు ఖర్చు చేసుకున్నవారు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశ్యంతో సీఎంఆర్ఎఫ్ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. బాధితులు ఆసుపత్రిలో ఖర్చు చేసుకున్నదానిలో కొంత భాగం పూడ్చేందుకే సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. 16 మంది బాధితులకు చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి,చిప్ప మోహన్, మల్లప్ప పటేల్, శ్యామప్ప, సంజీవ్, నాగ్‌నాథ్ పటేల్, సంతోష్ దేశాయ్, వినోద్, మొగులాగౌడ్, గంగాగౌడ్, విఠల్ పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన సదస్సు

ఇందూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పశువైద్యశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ రేబీస్ వ్యాధి వ్యాధి నివరించడానికి పెంపుడు కుక్కల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని కుక్క కాటుకు గురైన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఎన్ని డోసులు టీకాలు వేయించుకోవాలి అనే విషయంపై కార్యక్రమంలో క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు 45 పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ నజీర్ అహ్మద్, డాక్టర్ కైసర్ అహ్మద్, పశువైద్యాధికారి డాక్టర్ హనుమంత రెడ్డి, డాక్టర్ కిరణ్ దేశ్‌పాండే, డాక్టర్ బాబురావు, ట్రైనింగ్ డాక్టర్లు, పశువైద్య సిబ్బంది, పెంపుడు కుక్కల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



నాచుపల్లిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నసురుల్లాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు ఆదివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని నాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు కుమారుడు రాజశేఖర్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు సోదరుని కూతురు సుజాత కొన్ని రోజుల క్రితం మరణించగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం కామిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మంగలి రఘునాథ్ కొన్ని రోజుల క్రితం మరణించగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నసరుల్లాబాద్ మండల నాయకులు పెర్క శ్రీనివాస్, ప్రతాప్ సింగ్,పెద్ద కాపు సాయిలు, తదితరులు ఉన్నారు.

వరద నీటితో నిలిచిపోయిన రాకపోకలు



నిలిచిపోయిన రాకపోకలను పరిశీలిస్తున్న ఆర్ఐ

మద్నూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలోని చిన్న టాక్లి పెద్ద టాక్లీ మధ్య లోతట్టు ప్రాంతాలు వరదనీటితో నిలిచిపోవడంతో రాకపోకలు రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామస్తులను అవగాహన కల్పించమని పంపించామని ఆర్ఐ సాయిబాబా తెలిపారు. లేండినది, నిజాంసాగర్ కెనాల్ ప్రాజెక్టు భారీగా నీరు వదిలినందున నీరు చిన్న టాక్లి నుండి పెద్ద టాకి వెళ్లే లోతట్టు ప్రాంతంలో నీరు భారీగా ప్రవహిస్తున్నందున రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడం జరిగింది. రాకపోకల విషయంలో ప్రజలకు తగు సూచనలు చేస్తూ నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించిన వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, ప్రజలు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



మహాలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ విద్యా జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారు ఆదివారం శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ఆలయంలో హోమం, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 161వ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సత్యయ్య వాహనదారులకు సూచించారు. ఆదివారం బేగంపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యయ్య మాట్లాడుతూ వాహనదారులు తాము వా హనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు రహదారి నియమాలు పాటించాలన్నారు.

బీర్కూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు



బీర్కూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బేగంపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బీర్కూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలను మహిళలు, యువతులు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. రంగు రంగుల పూలను తీసుకుని వచ్చారు. బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఉంచి బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం గ్రామ సమీపంలోని ఊర చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఊరూరా సంబరాలు

పెద్దకొడప్‌గల్: తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ సంబరాలు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో అంబరాన్నంటాయి. ఉదయాన్నే ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లి గునుక, తంగేడు, బంతి, చామంతి తదితర రకాల పూలను సేకరించి బతుకమ్మను పేర్చుకున్నారు. అనంతరం సాయంత్రం సమయంలో గ్రామ ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను తీసుకవచ్చి పాటలు పాడుతూ పాటకు అనుగుణంగా చప్పట్లతో బతుకమ్మలను పూజించారు. సాయంత్రం సమయంలో ఏ పల్లెలో చూసిన బతుకమ్మ సంబరాలతో పల్లెలు పులకించిపోయాయి. అనంతరం చీక టి పడిన తర్వాత ఆయా గ్రామాల చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చే శారు. తిరిగి వచ్చే సంవత్సరం రా బతుకమ్మంటూ వీడ్కోలు పలికారు.

వర్షం లేకపోవడంతో మహిళల హర్షం..

ప్రతీ రోజు సాయంత్రం సమయంలో వర్షం బారిగా కురుస్తుండటంతో బతుకమ్మ పండుగ ఎలా జరుగుతుందోనని మహిళలు ఆందోళనలో వ్యక్తం చేశారు. అయితే వరుణుడు తమపై జాలితో చినుకులు కురిపించలేదని దీంతో పండగ ఆనందంగా జరుపుకున్నామని మహిళలు సంతోషం వ్యక్తం చే శారు. చాలా రోజుల తర్వాత సాయంత్రం సమయంలో వాన జాడ లేకపోవడంతో పండుగ సజావుగా సాగింది.

రేణుకా ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తా

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

ఇందల్వాయి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల కేంద్రంలోని తిర్మాన్‌పల్లి గ్రామం లో కొలువై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి దేవాలయం గత 60 సంవత్సరాల క్రితం నిర్మించింది కావడంతో శిథిలవస్థా పరిస్థితుల్లో ఉన్నందున స్థానిక నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి మాత మందిరం వద్దకు చేరుకొని పునర్నిర్మాణానికి పూజలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే నిధుల నుండి గుడి పునర్నిర్మాణానికి నిధులు దశల వారీగా మంజూరు చేసేటట్లు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గుడి ముందర ఉన్న కాల్వను సీసీ ద్వారా మరమ్మత్తులు చేయాలని కోరగా సీడీపీ నిధుల నుంచి లేదా ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి కానీ నిధులు మంజూరు చేసి ఆ కాల్వపనులను సీసీతో పూర్తి చేయించేలా కృషి చేస్తానని తెలిపారు. గౌడ కులస్తులు ఐక్యమైత్యంతో గుడి పునర్నిర్మాణం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి మాత వద్ద వారం వారంలో రెండు మూడు రోజులు పండగ వాతావరణం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఎల్లమ్మ తల్లికి పండగలు నిర్వహించడంతో భక్తుల రద్దీ క్రమం క్రమం పెరుగుతూ వస్తుందని తెలిపారు. దీంతో భక్తులు ఎల్లమ్మ దేవి వద్ద పండగను జరుపుకోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో గౌడ నాయకులను, కులాస్తులను మహిళలను అభినందించారు. గుడి శిథిలవస్థకు చేరుకోవడం భక్తులకు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారడంతో గౌడ సంఘం నాయకులు కులాస్తులు మహిళలు ఏకమై రేణుక ఎల్లమ్మదేవి మాత మందిరాన్ని పునర్నిర్మాణం చేయాలని పట్టుదలతో మహిళలు ప్రతినెల పది పది రూపాయల చొప్పున పోగుచేసి ఆలయ పునర్నిర్మానాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ నిర్మాణం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ చింతల కిషన్, మాజీ ఎంపీపీ ఉమ్మడి గోపి, లక్ష్మి, తిర్మాన్ పల్లి గౌడ సంఘం అధ్యక్షులు రాజనర్సగౌడ్, పడాల శంకర్ గౌడ్, ఏజీ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఏ పెద్ద గంగ గౌడ్, చిన్న గంగాగౌడ్, లింగాగౌడ్, నారాగౌడ్, అంజాగౌడ్, నరేష్ గౌడ్, ఎస్. ప్రవీణ్ గౌడ్, జంగిలి లక్ష్మి, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ పరిధిలోని బృందావన్ గార్డెన్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దత్తబస్తీ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాన వక్త విద్యాభారతీ దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఎంఈవో ఎల్లయ్య, ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ కొమ్మిరెడ్డి స్వామిలు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తవుతున్నందున ప్రతీ బస్తీలో గ్రామగ్రామాన విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లో సమాజంలో పంచపరివర్తన తీసుకురావడం కోసమే లక్ష్యంగా చేసుకుని ముందుకు కదులుతున్నట్లు తెలిపారు. కుటుంబ ప్రబోధన్ ద్వారా ప్రతీ కుటుంబాన్ని సంరక్షించుకోవడం కోసం పూర్వపు పద్ధతులను పాటించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

మద్నూర్‌లో..

మద్నూర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గంగారాం పాల్గొనగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ ప్రచారక్ శివకుమార్ స్వయంసేవలకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశాన్ని ఉన్నత స్థాయిలో తీసుకెళ్లడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కృషి చేస్తుందని గుర్తు చేశారు. 1925 విజయదశమి రోజు ప్రారంభమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖలు లక్షలాదిగా గ్రామాల్లో నడుస్తున్నాయని



కామారెడ్డిలో మాట్లాడుతున్న ప్రధాన వక్త లక్ష్మణ్‌రావు



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఇందూరు విభాగ్ ప్రచారక్

ఈ విజయదశమి నాటికి వంద సంవత్సరాలు పూర్తయితున్న సందర్భంగా పంచ పరివర్తన కార్యక్రమాన్ని మాననీయ సరసంగ్ చాలక్ మోహన్ భగవత్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికి దైవభక్తి ఉంటుంది. కానీ దేశభక్తి ఉండటం లేదని రాష్ట్రీయ స్వ యం సేవక్ సంఘ్ నిత్య శాఖ ద్వారా స్వయంసేవకులకు దేశభక్తిని గుర్తు చేస్తుందని సూచించారు. ఆపద సమయాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ కార్య కర్తలు ఆదుకుంటారని తెలిపారు. దేశంలో ఎక్కడ ప్రమాదాలు జరిగినా ముం దుగా అక్కడికి చేరుకునేది రాష్ట్రీయ స్వయంసేవక్ కార్యకర్తలేనని గుర్తు చేశారు. విజయదశమి కార్యక్రమాన్ని పురస్కరించుకొని కార్యక్రమానికి వచ్చిన పెద్దలు తమ పిల్లలను నిత్య శాఖకు పంపించాలని తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతుకమ్మ

- జిల్లా పోలీస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు
- హాజరైన కలెక్టర్, సీపీ



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, సీపీ కుటుంబ సభ్యులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉన్న నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీస్ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది, రేంజ్ కార్యాలయ సిబ్బంది, హోంగార్డ్స్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయ లక్ష్మి గార్డెన్ హాల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య కుటుంబ సభ్యులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతుకమ్మ అని తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి గౌరమ్మను పూజించారు. బతుకమ్మలను ఒకచోట పెట్టి బతుకమ్మ ఆటపాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎస్పీ బస్వారెడ్డి, అదనపు డీసీపీ రాంచంద్రరావు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐలు, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ల పరిశీలన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని బొడ్డెమ్మ చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌ను అర్బన్ శాసనసభ్యుడు ధన్‌పాల్ సూర్య నారాయణ మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జనంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ ఇనాయిత్ అలీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సిరికొండలో సమావేశమైన పదో తరగతి పూర్వ విద్యార్థులు

సిరికొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులుగా ఒకరికొకరు సహాయం చేసుకుంటూనే సమాజంలో సహాయక కార్యక్రమాలు తీసుకోవాలని విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యయులు కోరారు. సిరికొండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1988-89 బ్యాచ్‌కు పదో తరగతి చదివి న పూర్వ విద్యార్థులు ఆదివారం సిరికొండలో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.బాల్‌రాజ్,ఇజాపగోపాల్,ఎల్.గంగాధర్,బల్‌రాం,సుదర్శన్,బాల్‌రాజు, గంగాధర్, స్లీక్‌నర్సయ్య,మాలవత్ చందర్,రామ్‌ల,వసంత,భారతి,లక్ష్మి, అంజనేయులుతో పాటు 32 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమయ్యేదే బతుకమ్మ

- నేటితో ముగియనున్న బతుకమ్మ వేడుకలు
- నేడే సద్దుల బతుకమ్మ

నిజామాబాద్‌కల్చరల్,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచులు సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ ప్రతియేటా భాద్రపద అమావాస్య మొదలయ్యే పండుగ దుర్గాష్టమి రోజుతో ముగుస్తుంది. ప్రకృతితో మమేకమయ్యే ఈ పండుగ ప్రతిరోజు తీరొక్క పేరుతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మను తయారుచేసి అందులో గౌరీదేవిని పెట్టి పూజిస్తారు. ఈ వేడుకలు ప్రాంతాన్ని బట్టి కొంత వైవిధ్యం కనిపిస్తున్నా ప్రతి ప్రాంతంలో బతుకమ్మను పెట్టి పూజించడం సాంప్రదాయంగా వస్తుంది. 9 రోజుల పాటు జరుపుకునే పూలపండుగలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. పండుగలో మొత్తం కుటుంబ సభ్యులు పాల్గొంటు నిండిపోయే వేడుకగా జరుపుకుకోవడం ప్రత్యేకం. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలతో ఇమిడి ఉండి బతుకమ్మ పండుగ సాగుతుంది. బతుకమ్మను త్రికోణ ఆకారంలో వివిధ రకాల పూలతో పేర్చి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ మహిళలు తమ కష్టసుఖాలు,ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి వంటి అంశాలను జోడించుకుని జరుపుకుంటారు. ఎన్నోచరిత్రలు,పురణాలు తమఇంటి దేవతలు వంటి వాటిని పాటలో గుర్తుచేసుకుంటూ బతుకమ్మ పాటలు పాడుతారు.

పూల పండుగలో చివరి రోజుగా ఆడపడుచులు జరుపుకునేది సద్దుల బతుకమ్మ. ఐదు రకాలుగా సద్దులు (భోజనం) తయారుచేసి గౌరీదేవికి నివేదించడమే ఈ సద్దుల పండుగ ముఖ్య ఉద్దేశం. చింతపండు, నువ్వులు, కొబ్బరి, నిమ్మకాయ వంటి వాటితో ఈ సద్దులను తయారుచేస్తారు. 9వ రోజున గౌరమ్మకు విశేష పూజలు నిర్వహించి ఐదు రకాల సద్దులతో పాటు వివిధ రకాల పిండి పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. జిల్లాకేంద్రంలోని సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని మహిళలు జరుపుకోడానికి ఖిల్లా ప్రాంతంలోని బొడ్డెమ్మ చెరువు, పూలాంగ్, నీలకంఠేశ్వర ఆలయం, మాధవనగర్ చెరువు, అయోధ్యనగర్, బోర్గాం(పి), ఎల్లమ్మగుట్ట, తదితర ప్రాంతాల్లో నగరపాలకసంస్థ విద్యుత్ దీపాలు, బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశాయి.

మోపాల్:మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా జుపుకు న్నారు. రంగురంగుల పూలతో పోటా పోటీగా బతుకమ్మలను పేర్చారు. గ్రామం నడిబొడ్డులో పెట్టి బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మలను గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. చెరువుల వద్ద వీడీసీ ఆధ్వర్యంలో వీధిదీపాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్న మహిళలు

నంది పేట్:మండల కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మండలంలోని పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.

నిజామాబాద్‌కల్చరల్:తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని అమెరికాలోని కోస్టన్ సిటీలో మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో తేజస్విని, దివ్య, దీప్తి, మంజుల, దివ్యరెడ్డి, నియారెడ్డి, మేఘన, హరిప్రియ, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమె' ఎవరో..?

(5వ పేజీ తరువాయి)

చైర్మన్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించడంతో జిల్లా వ్యాప్తంగా తమకు అనుకూలంగా ఉన్న జెడ్పీటీసీ స్థానాలపై చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఆశావాహులు కన్నేశారు. ముఖ్యంగా బీసీ మహిళకు రిజర్వు అయిన కోటగిరి, మాక్లూర్, మెండోరా, మోర్తాడ్, మోస్రా, ఏర్గట్లతో పాటు బీసీ జనరల్ స్థానానికి రిజర్వు అయిన డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మోపాల్, నందిపేట్, నవీపేట్, పోతంగల్, వేల్పూర్ మండలాలపై బీసీ నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మండలాలే కాకుండా జనరల్ మహిళకురిజర్వు అయిన ఆర్మూర్,భీంగల్, చందూర్, రుద్రూర్, ఎడపల్లి మండలాలు, జనరల్‌రిజర్వు అయిన బాల్కొండ, కమ్మర్‌పల్లి, నిజామాబాద్ రూరల్, రేంజల్, సిరికొండ మండలాలపై అన్ని పార్టీల నేతలు దృష్టి పెట్టారు. ఈ మండలాల నుంచి బీసీ మహిళ లు పోటీ చేసే అవకాశం ఉండటంతో ఆశావహులు ఈ మండలాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టారు.

అన్ని పార్టీలలో ఆశావహులు..

అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు జిల్లాలో బలంగా ఉన్న బీజేపీ, గతంలో జిల్లాపరిషత్‌ను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ సైతం జిల్లా పరిషత్ చైర్మన్ పదవిపై కన్నేశారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌లో జడ్పీ చైర్‌పర్సన్ పదవి కోసం తీవ్ర పోటీ ఉండే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా కావడంతో నిజామాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎవరు పోటీలో ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. ఆయనకు అత్యంత దగ్గరగా ఉండే వ్యక్తులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని ఆశించే అవకాశాలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆకుల లలిత సైతం జడ్పీ చైర్‌పర్సన్ పదవి కొరకు పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆమె సొంత మండలం మాక్లూర్ బీసీ మహిళకు రిజర్వు కావడం, జెడ్పీ చైర్‌పర్సన్ పదవి కూడా బీసీ మహిళకు రిజర్వు కావడంతో ఆమెకు అధిక అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ ఈరవత్రి అనిల్ సతీమణి సైతం పోటీలో ఉండే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. బోధన్ నియోజకవర్గం నుంచి గతంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేసి ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరిన రజితయాదవ్ సైతం పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈమె ప్రాతినిథ్యం వహించిన ఎడపల్లి మండలం సైతం జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. బీజేపీలోనూ బీసీ మహిళ నాయకురాళ్లు పోటీకి సిద్ధమవుతున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి సతీమణి దివ్య ఇదివరకు నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేయగా జెడ్పీ చైర్‌పర్సన్ పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం బీసీ జనరల్‌గా రిజర్వు కావడం వారికి కలిసొచ్చే అంశం. ఇంకా బీజేపీలో సీనియర్ నాయకులు సైతం జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు. బీఆర్ఎస్‌లోనూ జడ్పీ చైర్‌పర్సన్ పదవి కోసం ఇప్పటి నుంచే ఆశావహులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

(5వ పేజీ తరువాయి)

ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. బ్రాహ్మణ కాలనీలో ఉండే వేలేటి పవన్‌శర్మ అనే పూజారి ఈనెల 23న కుటుంబ సమేతంగా దుర్గా పూజ కోసం ఇంటికి తాళం వేసి వెళ్లి గంటల వ్యవధిలోనే ఇంటికి వచ్చి చూడగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంట్లో దొంగతనానికి పాల్పడి 33 తులాల బంగారంతో పాటు 25 తులాల వెండి, రూ.30వేలు దొంగిలించినట్లు 5వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిజామాబాద్ నార్త్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 5వ టౌన్ ఎస్సై గంగాధర్‌లు దర్యాప్తు ముమ్మరం చేశారు. నాగారం దొడ్డికొమురయ్య కాలనీకి చెందిన షేక్ సల్మాన్ అలియాస్ సోను మరాఠీ, ఆకా ష్‌లను ఆదివారం నాగారంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు దొడ్డికొమురయ్య కాలనీకి చెందిన పాత నేరస్థుడు షేక్ సాధక్‌ను ఏ1గా, వినోద్ చౌహాన్‌ను ఏ2గా, ముక్తెసాయినాథ్ ఏ3గా, షేక్ సల్మాన్ ఏ4గా, ఆకాష్ ఏ5గా వీరు ఐదుగురు ముఠాగా ఏర్పడి జల్సాలకు డబ్బులు సరిపోగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏ1గా ఉన్న షేక్ సాధక్‌పై గతంలో దొంగతనం, గంజాయి కేసులతో పాటు ఏ2 వినోద్ చౌహాన్, ఏ3 సాయినాథ్ లపై వివిధ దొంగతనం కేసులు ఉన్నాయి. ఆటోలో బ్రాహ్మణకాలనీలో తాళం వేసి ఉన్న పవన్ శర్మ ఇంట్లోకి వెళ్లి నింధితులు దొంగతనం చేసినట్లు నేరస్తులు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఆటోలో అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ సల్మాన్, ఆకాష్‌లను పోలీసులు పట్టుకొని ఆటోతో పాటు ఫోన్‌లను, 31 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 2 టీమ్‌లు ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని సీపీ అభినందించారు.

గోదావరిలో భారీగా నీటి ప్రవాహం

(5వ పేజీ తరువాయి)

గోదావరిని ఆదివారం ఎస్ఐ తిరుపతి, ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డిలు పరిశీలించారు. కందకుర్తి త్రివేణి సంగమం వద్ద హరిద్ర, మంజీర, గోదావరి నదులు ఉగ్రరూపం దాల్చాయి.అంతర్రాష్ట్ర బ్రిడ్జి పూర్తిగా నీట మునిగి పురాతన శివాలయం, పుష్కర ఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తాకి గ్రామ పోలిమేర వరకు నీటి ప్రవాహం కొనసాగుతుంది. నీలా, తాడ్‌బిలోలి, బోర్గాంలో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పీపీ దయాకర్‌గౌడ్‌కు సన్మానం

సుభాష్‌నగర్,సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎస్సీ ఎస్టీ స్పెషల్ పీపీగా నియమితులైన దయాకర్‌గౌడ్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని దయాకర్‌గౌడ్ నివాసంలో ఆయనను కలిసి శాలువా, బుకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు నాగభూషణం, నాంపల్లి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అట్రాసిటీ కేసుల్లో న్యాయం జరిగే విధంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుజిత్, కిష్టయ్య, రాజేందర్, పోశెట్టి, దీపక్, నర్సయ్య, సాయిలు, మోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదీయ కాలనీలో చోరీ

సుభాష్‌నగర్,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. మహమ్మదీయ కాలనీలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి నగదును అపహరించుకుపోయారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న షకీల్ కుటుంబం మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇళ్లంతా చిందరవందరగా ఉండటంతో షకీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌హెచ్‌వో గంగాధర్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంజీరా ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలకు తరలిస్తున్నారు. గత నెల రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు సూచనలు చేసినప్పటికీ గ్రామస్థులు పట్టించుకోలేదు. కానీ ఆదివారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా వరద ఉధృతి రావడంతో హుటాహుటిన అధికారులు బస్సులలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హంగర్గ సరిహద్దు గ్రామాల్లోని 7వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. సోయాపంట చేతికి రాకుండా పోయింది. కల్దుర్కి తదితర ప్రాంతాలలో వరిపంట సైతం నీట మునిగి రైతుల చేతికి రాకుండా పోయింది.